# హుస్నాబాద్‌లో ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం ప్రత్యేక డ్రైవ్



బార్డర్ వేస్తున్న మున్సిపల్ సిబ్బంది దృశ్యం

**హుస్నాబాద్, మే12**
హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా మంగళవారం పోలీసు శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక ట్రాఫిక్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మల్లెచెట్టు చౌరస్తా వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా బార్డర్లు ఏర్పాటు చేసి వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను గుర్తించారు. ద్విచక్ర వాహనాలను రహదారిపై అడ్డంగా నిలపకుండా క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. దుకాణాల ముందు ప్రత్యేకంగా గీతలు గీసి ముగ్గులు వేయించడం ద్వారా ఆ పరిధిని దాటకుండా ఉండాలని వ్యాపారులకు సూచించారు. ఆ గీతలను దాటి వాహనాలు నిలపడం లేదా వస్తువులు ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. అదేవిధంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి నాగారం రోడ్డువరకు కూడా రహదారికి ఇరువైపులా బార్డర్లు ఏర్పాటు చేసి, గీతలు దాటకుండా దుకాణదారులను అప్రమత్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం, అతివేగంగా వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రజలు, వ్యాపారులు పోలీసు శాఖకు సహకరించి ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తాటి మల్లిఖార్జున్ రెడ్డి, సీఐ కె. శ్రీనివాస్,ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి,సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గోమాత మిల్లుకు గ్రీన్ సిగ్నల్

## కేబీ కాలనీ రైతులకు మాత్రం 'వెయిటింగ్ టోకెన్'!

**20 రోజులుగా ధాన్యం ఎండలో... అధికారులు మాత్రం చల్లని గదుల్లో!**

**"సీఈవో రాకపోతే లేవం" అంటూ రైతుల బైఠాయింపు**



హుస్నాబాద్ ప్యాక్స్ కార్యాలయం ముందు కేబీ కాలనీ రైతుల బైఠాయింపు



హుస్నాబాద్ లోని ప్యాక్స్ కార్యాలయం

**హుస్నాబాద్, మే12**
హుస్నాబాద్ పట్టణంలోని కేబీ కాలనీ రైతుల సహనం చివరకు ప్రాథమిక సహకార పరస్పర సహాయ సంఘం(ప్యాక్స్)కు చేరి ఆగ్రహంగా మారింది. తాము చెమటోడ్చి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు 20 రోజులుగా ఎదురుచూస్తున్నా అధికారులు మాత్రం "ఇంకొంచెం ఆగండి" అన్న మాట తప్ప చర్యలు తీసుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు కాక ఎండలో ఆరబోసిన బస్తాలు రోజురోజుకు రంగు మారుతుంటే రైతుల ఆశలు కూడా అలాగే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "పండించిన ధాన్యం కంటే... ఎదురుచూపులే ఎక్కువయ్యాయి" అంటూ రైతులు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఫ్యాక్స్ కార్యాలయం ఎదుట రైతులు బైఠాయించి ఆందోళనకు దిగారు. "సీఈవో వస్తేనే లేస్తాం... హామీ ఇస్తేనే కదులుతాం" అంటూ భీష్మించుకుని కూర్చున్నారు. రైతుల ఆరోపణల ప్రకారం... కేబీ కాలనీ కొనుగోలు కేంద్రంలో మాత్రం హమాలీలు లేరని, లోడింగ్ సిబ్బంది అందుబాటులో లేరని చెప్పి రోజులు గడుపుతుండగా స్థానిక గోమాత రైస్ మిల్లులో మాత్రం అన్నీ సవ్యంగా నడుస్తున్నాయన్నారు. అక్కడ రోజుకు ఒకటి రెండు లారీల చొప్పున ధాన్యం తరలిపోతుంటే... తమ ధాన్యం మాత్రం ఎండలోనే "డ్యూటీ" చేస్తున్నదని రైతులు ఎద్దేవా చేశారు. "గోమాత మిల్లుకు ప్రత్యేక దీవెనలు ఉన్నాయా...? లేక మా ధాన్యానికి దురదృష్టమే రాశిలో ఉందా...?" అంటూ రైతులు అధికారుల వైఖరిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సుమారు గంటపాటు రైతులు నినాదాలతో కేంద్రాన్ని మార్మోగించారు. అధికారులు, సెంటర్ ఇన్‌చార్జి వచ్చి మాట్లాడినా మొదట రైతులు వినిపించుకోలేదు. చివరకు "ఒక గంటలోనే తూకం వేసి లారీలు పంపిస్తాం" అని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. అయితే "ప్రతి ఏడాది ఇదే కథ... రైతు కష్టానికి మాత్రం ఎప్పుడూ వెయిటింగ్ లిస్టే" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# భగీరథ్ పిటిషన్‌పై ఉత్కంఠ

**హైకోర్టును ఆశ్రయించిన భగీరథ్**

**పోక్సో కేసు కొట్టివేయాలంటూ విజ్ఞప్తి**

**రెండు వైపులా పరస్పర ఆరోపణలు**





**హైదరాబాద్, మే 12**
తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసును సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన కేసులో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొంటూ ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. భగీరథ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ఈ నెల 14వ తేదీన హైకోర్టు వెకేషన్ బెంచ్‌లో విచారణ జరగనుంది. ఈ కేసులో న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇటీవలి రోజులుగా ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కేసు వివరాల ప్రకారం, 17 ఏళ్ల మైనర్ బాలికను భగీరథ్ వేధిస్తున్నాడంటూ ఆ బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మే 8వ తేదీన హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అయితే తమపై వచ్చిన ఆరోపణలను భగీరథ్ వర్గాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ కేసు వెనుక రాజకీయ కుట్ర ఉందని, కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా తనను లక్ష్యంగా చేసుకుని ఈ వ్యవహారం నడిపిస్తున్నారని భగీరథ్ తరపు వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ కేసులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని భగీరథ్ కూడా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అదే రోజు కరీంనగర్ పోలీసులు బాలిక, ఆమె తల్లిపై కేసు నమోదు చేశారు. దీంతో ఈ వ్యవహారం మరింత సంచలనంగా మారింది. ప్రస్తుతం రెండు కేసులపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఒకవైపు పోక్సో కేసు, మరోవైపు బ్లాక్‌మెయిల్ ఆరోపణలు ఉండటంతో ఈ వ్యవహారం క్లిష్టంగా మారింది. రానున్న రోజుల్లో హైకోర్టు విచారణ, పోలీసు దర్యాప్తు ఆధారంగా కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

# భగీరథ్‌ను కఠినంగా శిక్షించాలి

**రాంనగర్‌లో బీఆర్ఎస్ ఆందోళన**

**బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం**

**గాయపడిన కానిస్టేబుల్‌కు పరామర్శ**



**హైదరాబాద్, మే 12 :**
మైనర్ బాలికపై దాడి కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాంనగర్ చౌరస్తాలో భారత రాష్ట్ర సమితి నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. బండి సంజయ్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నంలో ఒక పోలీస్ కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు గాయపడినట్లు సమాచారం. వెంటనే అక్కడున్న నాయకులు, పోలీసులు కలిసి అతడిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడిన కానిస్టేబుల్‌ను పరామర్శించేందుకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి బీఆర్ఎస్ నాయకులు ఆసుపత్రికి వెళ్లారు. వైద్యులతో మాట్లాడి కానిస్టేబుల్‌కు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ధైర్యంగా ఉండాలని అతనికి సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా కేసును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల నేపథ్యంలో రాంనగర్ ప్రాంతంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అదనపు బలగాలను మోహరించారు. కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# జర్మనీలో ఉద్యోగాలకు మంచి అవకాశాలు

**నర్సులకు మంత్రి వివేక్ సూచనలు**

**విదేశీ భాషలపై దృష్టి పెట్టాలని పిలుపు**

**టామ్‌కామ్ ద్వారా అంతర్జాతీయ అవకాశాలు**



**హైదరాబాద్, మే 12**
జర్మనీలో యువతకు, ముఖ్యంగా నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. టామ్‌కామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ట్రిపుల్ విన్ ప్రోగ్రామ్"లో శిక్షణ పొందుతున్న నర్సులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై వారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొత్త భాష, కొత్త వాతావరణానికి అలవాటు పడటం ఒక సవాల్ మాత్రమే కాకుండా ఎదుగుదలకు మంచి అవకాశమని పేర్కొన్నారు. జర్మనీలో పనిచేసే అవకాశం రావడం యువత భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ముఖ్యంగా నర్సింగ్ వృత్తిలో సేవాభావం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు చాలా కీలకమని చెప్పారు. "రోగి వ్యాధిలో సగం, నర్సులు ఇచ్చే ధైర్యం వల్లే తగ్గిపోతుంది" అని మంత్రి వ్యాఖ్యానించారు. రోగుల కోలుకోవడంలో నర్సుల పాత్ర ఎంతో ముఖ్యమని కొనియాడారు. తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్ ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు.ప్రస్తుతం జర్మనీకి వెళ్లే ఈ బ్యాచ్ విజయం సాధిస్తే భవిష్యత్తులో మరింత మందికి అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. జర్మన్ భాషను నేర్చుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం గంట సమయం నైపుణ్యాభివృద్ధికి కేటాయించాలని కోరారు. జర్మన్ పుస్తకాలు చదివే స్థాయికి చేరుకోవాలని, అక్కడి సంస్కృతిని కూడా అర్థం చేసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్ కార్యక్రమాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించిందని తెలిపారు. రాష్ట్రంలో నర్సింగ్ కళాశాలలు, సీట్ల సంఖ్య పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ హరిచందన మాట్లాడుతూ, తాను హిందీ సినిమాలు చూస్తూ హిందీ భాష నేర్చుకున్న అనుభవాన్ని వివరించారు. విదేశీ భాషలను నేర్చుకోవడం ఇప్పుడు చాలా సులభమైందని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా విదేశీ భాషా శిక్షణ అందిస్తోందని, స్నేహితులతో కలిసి జర్మన్ భాషను సాధన చేయాలని సూచించారు. టామ్‌కామ్ డైరెక్టర్ కాంతి వెస్లీ మాట్లాడుతూ, జర్మన్ ఫెడరల్ ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీతో టామ్‌కామ్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 46 మంది నర్సులు జర్మన్ భాషా శిక్షణ పూర్తి చేశారని, 15 మందికి ఆఫర్ లెటర్లు వచ్చాయని వెల్లడించారు.

## 50 కార్ల కాన్వాయ్‌తో బీజేపీ నేత రయ్‌రయ్!

భోపాల్, మే 12: ఇంధనం పొదుపుగా వాడుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చి రెండు రోజులు కూడా కాకముందే మధ్యప్రదేశ్‌లో ఒక బీజేపీ నేత 50 కార్ల కాన్వాయ్‌తో అట్టహాసంగా వెళ్లడం సంచలనంగా మారింది. మధ్యప్రదేశ్ పాఠ్యపుస్తకాల కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించేందుకు బీజేపీ నేత సౌభాగ్య సింగ్ ఠాకూర్ ఉజ్జయిని నుంచి భోపాల్‌కు సుమారు 50 ఎస్‌యూవీల కాన్వాయ్‌తో భారీ ర్యాలీగా వెళ్లారు. వెనుక ఇంకా పెద్దసంఖ్యలో మద్దతుదారుల వాహనాలూ ఉన్నాయి. అలంకరించిన వాహనాలు హైవేపై బారులుతీరి వెళ్తుండటం, ఎక్కడికక్కడ మద్దతుదారులు ఆయనకు స్వాగతం పలకడం వీడియోల్లో కనిపిస్తోంది.

# ఉదయనిధి వ్యాఖ్యలపై దుమారం

**అసెంబ్లీలో మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు**

**సనాతన ధర్మంపై పాత వైఖరి పునరుద్ఘాటన**

**రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ**

**చెన్నై, మే 12**
తమిళనాడు రాజకీయాల్లో మరోసారి సనాతన ధర్మం అంశం వేడెక్కింది. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ శాసనసభ వేదికగా చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త దుమారానికి దారితీశాయి. 2023లో దేశవ్యాప్తంగా తీవ్ర వివాదానికి కారణమైన "సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి" అన్న తన పాత వ్యాఖ్యలను ఆయన మరోసారి సభ సాక్షిగా పునరుద్ఘాటించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ, సనాతన ధర్మంపై తన అభిప్రాయంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని వెల్లడించారు. సామాజిక సమానత్వానికి విరుద్ధంగా ఉన్న భావజాలాలను వ్యతిరేకించడం తమ పార్టీ సిద్ధాంతమని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి విజయ్ సభలోనే ఉండటం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉదయనిధి వ్యాఖ్యల సమయంలో సభలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు తెలుస్తోంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఉదయనిధి చేసిన ఇలాంటి వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. పలు హిందూ సంఘాలు, రాజకీయ పార్టీలు ఆ వ్యాఖ్యలను ఖండించాయి. కొందరు నేతలు న్యాయస్థానాలను కూడా ఆశ్రయించారు.



వివిధ రాష్ట్రాల్లో కేసులు నమోదవడంతో ఈ అంశం జాతీయ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు అసెంబ్లీ వేదికగా మళ్లీ అదే అంశాన్ని ప్రస్తావించడంతో రాజకీయ వేడి మరింత పెరిగింది. ముఖ్యంగా తమిళనాడులో త్వరలో జరగనున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత పొందుతున్నాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై బీజేపీ సహా పలు పార్టీలు తీవ్రంగా స్పందించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు డీఎంకే వర్గాలు మాత్రం సామాజిక న్యాయం, సమానత్వం కోసం తమ పార్టీ ఎప్పటి నుంచో పోరాటం చేస్తోందని చెబుతున్నాయి. ఉదయనిధి వ్యాఖ్యలను ఆ దిశలోనే చూడాలని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అంశం రానున్న రోజుల్లో తమిళనాడు రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

**- పేదల సొంతింటి కల సాకారం - ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష**

**హైదరాబాద్, మే 12**
రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడతను జూన్ 2న ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ అంశాలపై ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో నగరాలకు దూరంగా నిర్మించిన ఇళ్లలో నివసించేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని క్షేత్రస్థాయి పరిశీలనల్లో స్పష్టమైందని మంత్రి తెలిపారు. జీవనోపాధి అవకాశాలు దూరమవుతాయనే కారణంతో చాలా మంది అక్కడికి వెళ్లడం లేదని చెప్పారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, మురికివాడలు, భూదాన్ భూములు, శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్ల ప్రాంతాలను గుర్తించి కొత్త ఇండ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

# సరిహద్దు కంచెపై ఢాకా స్పందన

**బెంగాల్ నిర్ణయంపై చర్చ**

**"ముళ్ల తీగలకు భయం లేదు"**

**ద్వైపాక్షిక సంబంధాలపై ఆసక్తి**

**కోల్‌కతా, మే 12 :**
పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నేతృత్వం లోని కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకున్న సరిహద్దు రక్షణ చర్యలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీ శాయి. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ముళ్లకంచె నిర్మాణం కోసం సరిహద్దు భద్రతా దళానికి భూమి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బంగ్లాదేశ్ తాజాగా స్పందించింది. బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సలహాదారు ఎం.హెచ్. కబీర్ మాట్లాడుతూ, "ముళ్ల తీగలకు ఢాకా భయపడదు" అని వ్యాఖ్యానించారు. తమ దేశ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భారత్ అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకునే ఉద్దేశం తమకు లేదని, తమ సంబంధాలు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వంతోనే కొనసాగుతాయని తెలిపారు. ఇరు దేశాల మధ్య కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచే దిశగా నాయకత్వం కట్టుబడి ఉందని కబీర్ పేర్కొన్నారు. వాణిజ్యం, భద్రత, సరిహద్దు సమస్యలు వంటి అంశాల్లో పరస్పర సహకారం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇరు దేశాలు పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తున్నట్లు దౌత్య వర్గాలు



చెబుతున్నాయి. భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీ మేరకు సరిహద్దు కంచె నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే నిర్మాణ పనులను పూర్తి చేస్తామని పార్టీ ప్రకటించింది. ముఖ్యమంత్రి సువేందు అధికారి తొలి మంత్రివర్గ సమావేశంలోనే సరిహద్దు భద్రతా దళానికి అవసరమైన భూమి కేటాయింపునకు ఆమోదం తెలిపారు. అక్రమ చొరబాట్లు, స్మగ్లింగ్ కార్యకలాపాలను అరికట్టడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. సరిహద్దు భద్రతను మరింత బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ఈ నిర్ణయం పొరుగు దేశంతో సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న అంశంపై రాజకీయ, దౌత్య వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పటికే భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. కంచె నిర్మాణం పూర్తయితే అక్రమ వలసలు, అక్రమ రవాణాపై గణనీయమైన నియంత్రణ సాధ్యమవుతుందని భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అంశం భవిష్యత్తులో భారత్-బంగ్లాదేశ్ సంబంధాల్లో కొత్త చర్చలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు..

**- తహసీల్దార్ పంతంతో భూ భారతి ఆపరేటర్ తొలగింపు**

**- రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న ప్రజలు**

**మన సమాజం/చెన్నూరు:**
తహసీల్దార్ తన పంతం నెగ్గించుకునేందు చేసిన ఓ నిర్వాహం రిజిస్ట్రేషన్ దరఖాస్తుదారుల పాలిట శాపంగా మారింది. భూ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో తనకు సహకరించడం లేదని భూ భారతి ఆపరేటర్ ను తొలగించినట్లు తహసీల్దార్ కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తుండగా స్థానికంగా చర్చనీయాంశం అయింది. భూ భారతి ఆపరేటర్ అందుబాటులో లేకగత కొన్ని రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఎండలోనే రోజుల తరబడి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంటుందని, ప్రస్తుతం వేమనపల్లి రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న భూ భారతి ఆపరేటర్ ను తాత్కాలికంగా వినియోగిస్తుండగా, స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. తహసీల్దార్ పంతానికి దరఖాస్తుదారులు ఇబ్బంది పడాల్సిన



దుస్థితి నెలకొంటుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిస్తూ చెన్నూరు రెవెన్యూ కార్యాలయంలో రెగ్యులర్ భూ భారతి ఆపరేటర్ ను నియమించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# బెంగాల్‌లో కొత్త వివాదం

**కీలక నియామకంపై దుమారం**

**రాహుల్ ఘాటు విమర్శలు**

**బీజేపీ-టీఎంసీ మధ్య మాటల యుద్ధం**



**కోల్‌కతా, మే 12**
పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా పనిచేసిన మనోజ్ అగర్వాల్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించడం రాజకీయ దుమారానికి కారణమైంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఈ నియామకం జరగడం ప్రతిపక్ష పార్టీల అనుమానాలకు తావిచ్చింది. ఈ నియామకాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో స్పందించిన ఆయన, దీనిని "భారతీయ జనతా పార్టీ-ఎన్నికల సంఘం చోర్ బజార్"గా అభివర్ణించారు. ఎన్నికల సంఘం, భారతీయ జనతా పార్టీ కుమ్మక్కై పనిచేశాయని ఆరోపిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "దొంగతనం ఎంత పెద్దదైతే, దానికి వచ్చే బహుమతి కూడా అంత పెద్దదిగా ఉంటుంది" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నిర్వహణలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన అధికారికి వెంటనే రాష్ట్రంలో అత్యున్నత పరిపాలనా పదవి ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ నియామకం ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాల్సిన సంస్థలు రాజకీయ ప్రభావానికి లోనవుతున్నాయనే అనుమానాలు పెరుగుతున్నాయని ఆయన అన్నారు. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ నేతలు కూడా ఈ అంశంపై తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలను భారతీయ జనతా పార్టీ, ఎన్నికల సంఘం కలిసి ప్రభావితం చేశాయని ఆరోపిస్తూ మండిపడుతున్నారు. ఇప్పుడు జరిగిన ఈ నియామకం తమ ఆరోపణలకు నిదర్శనమని టీఎంసీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల పారదర్శకతపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని వారు విమర్శిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను భారతీయ జనతా పార్టీ గట్టిగా ఖండిస్తోంది. మనోజ్ అగర్వాల్ నియామకం పూర్తిగా అర్హతల ఆధారంగానే జరిగిందని పార్టీ నేతలు చెబుతున్నారు. గతంలో మమతా బెనర్జీ ప్రభుత్వం కూడా తనకు అనుకూలంగా ఉన్న అధికారులకు కీలక పదవులు ఇచ్చిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అదే విషయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని బీజేపీ నేతలు అంటున్నారు. ఈ వివాదం ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో వేడెక్కుతోంది. ఎన్నికల వ్యవస్థ స్వతంత్రత, అధికారుల నియామకాల పారదర్శకత వంటి అంశాలపై మరోసారి చర్చ మొదలైంది. రాబోయే రోజుల్లో ఈ వ్యవహారం మరింత రాజకీయ రగడకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నర్సులకు రాష్ట్రపతి పురస్కారాలు

**అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సత్కారం**

**ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుల ప్రదానం**

**సేవాభావానికి రాష్ట్రపతి ప్రశంసలు**



**న్యూఢిల్లీ, మే 12:** అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విశిష్ట సేవలు అందించిన నర్సింగ్ సిబ్బందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాలను ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేశారు. ఆరోగ్య రంగంలో నిస్వార్థ సేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న నర్సింగ్ సిబ్బంది సేవలను రాష్ట్రపతి ఈ సందర్భంగా కొనియాడారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా నర్సులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సేవా దృక్పథం, సహనం, మానవత్వానికి నర్సులు ప్రతీకలుగా నిలుస్తున్నారని అన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు, విపత్తుల సమయంలో వారి సేవలు దేశానికి ఎంతో అవసరమవుతున్నాయని వివరించారు. జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులు వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించిన నర్సులకు ఇచ్చే అత్యున్నత గౌరవాల్లో ఒకటిగా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, అత్యవసర వైద్య సేవల్లో విశేష కృషి చేసిన నర్సింగ్ సిబ్బందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారులు, వైద్య రంగ నిపుణులు, నర్సింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు. అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు. దేశ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో నర్సుల పాత్ర మరింత కీలకమవుతోందని నిపుణులు పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పలు ఆసుపత్రుల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నిరంతరం సేవలందిస్తున్న నర్సింగ్ సిబ్బందికి వివిధ వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



# అలా అంటే నేను ఒప్పుకోను!

తెలుగమ్మాయి శ్రీలీలకు తమిళంలోనూ మంచి క్రేజే ఉంది. రీసెంట్‌గా 'పరాశక్తి' సినిమాతో తమిళ ప్రేక్షకుల్ని పలకరించింది శ్రీలీల. ఆ సినిమా ఫలితం ఎలా ఉన్నా.. ఈ తెలుగందానికి మాత్రం మంచి గుర్తింపే దక్కింది. రీసెంట్‌గా ఓ తమిళ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నేను డాక్టర్‌ని. అనుకోకుండా యాక్టర్‌ని కూడా అయ్యాను. ఈ రెండూ నాకు గర్వకారణాలే. ఈ క్రెడిట్ మా అమ్మవల్లే నాకు దక్కింది. జీవితంలో జయాపజయాలు సహజం.వీశీజఱవం అపజయం ఎదురైనప్పుడు ఓ గంట ఏడుస్తాను. తర్వాత 'నెక్స్ట్' అంటూ రెడీ అయిపోతా. ప్రస్తుతం తెలుగు, తమిళంతో పాటు ఇప్పుడు హిందీలోనూ నటిస్తున్నా. అక్కడ నన్ను కొందరు లేడీ సూపర్‌స్టార్ అంటున్నారు. దానికి నేను ఒప్పుకోను. లేడీ సూపర్‌స్టార్ అంటే మా అక్క నయనతార మాత్రమే. నయన్ మాదిరిగా నేనూ తమిళం అబ్బాయినే పెళ్లాడతానేమో!' అంటూ చెప్పుకొచ్చింది శ్రీలీల.

ఇంకా చెబుతూ 'విమానప్రయాణం చేసేటప్పుడు ల్యాండింగ్ అంటే నాకెంతో భయం. ల్యాండయ్యాక పైలెట్, ఇతర యూనిట్ మొత్తానికి షేక్‌హ్యాండిచ్చి ధన్యవాదాలు చెప్పాలని అమ్మ చెబుతుండేది. దాన్ని తూచ తప్పక పాటిస్తుంటా' అంటూ గుర్తు చేసుకున్నది శ్రీలీల. ప్రస్తుతం ఆమె ధనుష్‌కు జోడీగా ఓ సినిమాలో నటిస్తున్నది.

# ఆ తరహా సినిమాలకు ఇక దూరం?

అగ్రనటి సమంత రూత్‌ప్రభు రూట్ మార్చారు. ఇన్నాళ్లూ స్టార్ హీరోల పక్కన ఆడిపాడి, స్టార్ హీరోయిన్ అనిపించుకున్న సామ్.. ఇకనుంచి ఆ తరహా సినిమాలు చేయకూడదని



నిశ్చయించారట. కథానాయిక ప్రధానంగా ఆమె నటించిన యూ-టర్న్, ఓ బేబీ సినిమాలు బాగా ఆడాయి. త్వరలో 'మా ఇంటి బంగారం' అంటూ మరో లేడీ ఓరియెంటెడ్ కథతో ఆమె రాబోతున్నది.వీశీజఱవం ఇక నుంచి ఇలాగే కేవలం మహిళా ప్రధాన కథల్లోనే నటించాలని, నటిగా తన ప్రతిభని నిరూపించుకునే అవకాశం ఇలాంటి సినిమాల ద్వారానే ఉంటుందని, స్టార్ హీరోల ప్రాజెక్టుల్లో నటించి, పాటలకే పరిమితం కాలేనని సామ్ భావిస్తున్నారట. సమంత లాంటి స్టార్.. సోలో సినిమాలు చేసి హిట్లు కొడితే, అది తోటి హీరోయిన్లకు స్ఫూర్తి దాయకమే. కమర్షియల్ ఫార్మాట్‌కు భిన్నంగా కొత్తకథలు వచ్చే అవకాశం కూడా ఉంది. త్వరలో రానున్న 'మా ఇంటి బంగారం' సినిమా ఓ సామాన్య మహిళ ఎదుర్కొనే సవాళ్లు, ఆమె సాధించే విజయాల నేపథ్యంలో ఉంటుందట.

# భవిష్యత్తులో వివాహం అర్థమే మారిపోవచ్చు : ఫరియా అబ్దుల్లా



ఫరియా అబ్దుల్లా.. 'జాతిరత్నాలు' సినిమాలో చిట్టి పాత్రతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ఈ టాలెంటెడ్ బ్యూటీ మరోసారి తన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తన చలాకీతనం, కామెడీ టైమింగ్‌తో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఫరియా.. తాజాగా ప్రేమ, పెళ్లి, జీవితంపై తన అభిప్రాయాలను పంచుకుని ఆసక్తికర చర్చకు తెరలేపింది. పెళ్లి గురించి మాట్లాడుతూ ఫరియా చాలా భిన్నమైన ఆలోచనలు వ్యక్తం చేసింది. తన దృష్టిలో ప్రేమ, వివాహం రెండూ వేర్వేరు అంశాలని ఆమె చెప్పింది. మనల్ని ఎవరైనా ప్రేమిస్తున్నారనే భావన చాలా అద్భుతంగా ఉంటుంది. జీవితంలో ఒక తోడు ఉండటం కూడా అవసరమే. కానీ పెళ్లి అనేది ఒక మనిషిని పూర్తిగా మార్చే బంధం. ఇప్పుడు యువతలో వివాహంపై ఆసక్తి తగ్గిపోతోంది. రాబోయే రోజుల్లో పెళ్లి అనే మాటకు అర్థమే మారిపోయే అవకాశం ఉంది" అంటూ ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుత ఈ తరం రిలేషన్‌షిప్స్‌ను చూసే విధానం పూర్తిగా మారిపోయిందని ఫరియా అభిప్రాయపడింది. స్వేచ్ఛ, వ్యక్తిగత స్పేస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న యువత.. సంప్రదాయ బంధాలపై అంత ఆసక్తి చూపించడం లేదని ఆమె విశ్లేషించింది. దీంతో ఆమె వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక తన వ్యక్తిగత జీవితంపై కూడా ఫరియా ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఒకవేళ తాను హీరోయిన్ కాలేదంటే.. పెద్ద క్రూయిజ్ షిప్‌లో చెఫ్‌గా పనిచేసేదాన్నని లేదా ఈవెంట్ మేనేజర్‌గా కెరీర్ కొనసాగించేదాన్నని తెలిపింది. ట్రావెలింగ్ అంటే తనకు చాలా ఇష్టమని, ట్రావెల్ వ్లాగర్‌గా కూడా మారే అవకాశం ఉండేదని చెప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఫరియా అబ్దుల్లా కేవలం నటి మాత్రమే కాదు.. మంచి డ్యాన్సర్, రచయిత్రి కూడా. హైదరాబాద్‌లోని లయోలా కాలేజీలో మాస్ కమ్యూనికేషన్ చదువుతున్న సమయంలో ఆమె ప్రతిభను దర్శకుడు నాగ్ అశ్విన్ గుర్తించారు. ఆ తర్వాత ఆడిషన్ ద్వారా జాతిరత్నాలు సినిమాలో అవకాశం దక్కించుకుని ఓవర్‌నైట్ స్టార్‌గా మారింది. సోషల్ మీడియాలో వచ్చే రూమర్లను పెద్దగా పట్టించుకోనని, మంచి కథలు, బలమైన పాత్రలే తనకు ముఖ్యమని ఫరియా స్పష్టం చేసింది. పాత్ర చిన్నదైనా.. క్యారెక్టర్ డిజైన్ బాగుంటే నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పి తన వృత్తిపట్ల ఉన్న నిబద్ధతను మరోసారి చాటుకుంది.

# 47 ఏళ్ల వయసులోనూ అదిరే ఫిట్‌నెస్..

## జ్యోతిక వర్కవుట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్!



ఒకప్పుడు సౌత్ ఇండస్ట్రీని తన అందం, నటనతో ఏలిన స్టార్ హీరోయిన్ జ్యోతిక ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ అదే జోరు కొనసాగిస్తున్నారు. వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే, తన ఫిట్‌నెస్‌తో కూడా అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ప్రస్తుతం 47 ఏళ్ల వయసులోనూ ఆమె చూపిస్తున్న ఎనర్జీ, ఫిట్‌నెస్ స్థాయి చూసి అభిమానులు మాత్రమే కాదు.. సినీ ప్రముఖులు కూడా షాక్ అవుతున్నారు. మదర్స్ డే సందర్భంగా జ్యోతిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వర్కవుట్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో ఆమె చేసిన కఠినమైన వ్యాయామాలు చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా పుల్-అప్స్, చిన్-అప్స్ వంటి కఠినమైన అప్పర్ బాడీ ఎక్సర్‌సైజ్‌లను ఎంతో ఈజీగా చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే.. తన ఆరోగ్యంపై కూడా అదే స్థాయిలో శ్రద్ధ పెట్టడం ఎంతో మందికి స్ఫూర్తిగా మారింది. "ఈ మదర్స్ డే సందర్భంగా మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి.. ఆరోగ్యంగా ఉండటమే నిజమైన సెల్ఫ్ లవ్" అంటూ ఆమె ఇచ్చిన సందేశం మహిళలను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. సాధారణంగా మహిళలకు అప్పర్ బాడీ స్ట్రెంత్ పెంచుకోవడం కాస్త కష్టమైన విషయమే. కానీ జ్యోతిక మాత్రం ట్రైసెప్ డిప్స్, బెంచ్ హాప్స్, కోర్ వర్కవుట్స్ వంటి హెవీ ఫిట్‌నెస్ రొటీన్‌ను చాలా సులభంగా చేస్తూ కనిపించారు. ఆమె పట్టుదల, క్రమశిక్షణకు ఈ వీడియో నిదర్శనమని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ వీడియో చూసిన పలువురు సినీ ప్రముఖులు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారు. బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా, సోహా అలీ ఖాన్ వంటి సెలబ్రిటీలు కూడా జ్యోతిక ఫిట్‌నెస్‌పై ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇక సోషల్ మీడియాలో అయితే "మీరు మాకు ఇన్‌స్పిరేషన్", "ఏజ్ జస్ట్ ఏ నంబర్ అని మీరు ప్రూవ్ చేస్తున్నారు" అంటూ నెటిజన్లు కామెంట్స్‌తో హోరెత్తిస్తున్నారు. ఇటీవల కాలంలో ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడులు ఎక్కువవుతున్న నేపథ్యంలో.. ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని జ్యోతిక తన జీవనశైలితోనే తెలియజేస్తున్నారు. కేవలం బరువు తగ్గడం కోసం మాత్రమే కాదు.. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయడం ఎంత ముఖ్యమో ఆమె ఉదాహరణగా నిలుస్తోంది.